క్లుప్తంగా

ఉచిత కంటి శస్త్ర చికిత్సల కోసం తరలింపు



ఉచిత కంటి శస్త్ర చికిత్సలకు వెళుతున్న లబ్ధిదారులు

తాళ్లరేవు: కంటి వెలుగు కార్యక్రమం ద్వారా ఉచిత కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు 10 మందిని కాకినాడ కిరణ్ కంటి ఆస్పత్రికి పంపినట్లు నేత్ర వైద్య నిపుణుడు సీరం సత్తిబాబు తెలిపారు. ఇటీవల ఇంజరం, ఉప్పంగల పంచాయతీల్లో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరాల్లో శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని గుర్తించి, గురువారం శస్త్ర చికిత్సలకు పంపించామన్నారు. శస్త్ర చికిత్సల అనంతరం వారికి అవసరమైన మందులు, కళ్లజోళ్లు ఉచితంగా అందిస్తామని చెప్పారు.

మెరుగైన బోధన కోసమే శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీవైఈవో గుబ్బల సూర్యప్రకాశరావు

అమలాపురం రూరల్: విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకే ఉపాధ్యాయులు, సీఆర్పీలకు టీచ్ టూల్ శిక్షణ అందిస్తున్నట్లు డీవైఈవో గుబ్బల సూర్యప్రకాశరావు అన్నారు. పేరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన టీచ్ టూల్ ప్రత్యేక శిక్షణ కార్యక్రమానికి సర్వశిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదన్‌రావు, డీవైఈవో గుబ్బల సూర్యప్రకాశరావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది రోజుల శిక్షణలో నేర్చుకున్న మెళకువలను ఉపాధ్యాయులందరూ తరగతి గదుల్లో వినియోగించి నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అకడమిక్ కో ఆర్డినేటర్ పిల్లి రాంబాబు, కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ బీవీవీ సుబ్రహ్మణ్యం, అంబాజీపేట ఎంఈవో కాంద్రేగుల వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు మట్టపర్తి పురుషోత్తరాజు తదితరులు పాల్గొన్నారు.

సూపర్–6 హామీలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సత్తిబాబు

అమలాపురం రూరల్: కూటమి ప్రభుత్వం రాష్ట్ర పురోగతికి సూపర్–6 హామీలు అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు డిమాండ్ చేశారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఉప్పలగుప్తం మండల కార్యదర్శి కామిశెట్టి నాగబాబు అధ్యక్షతన అమలాపురం నియోజకవర్గ సమన్వయకర్తల సమావేశం జరిగింది. సమావేశంలో సత్తిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం శ్వేతపత్రాల విడుదల పేరుతో హామీల అమలుకు రాష్ట్ర పరిస్థితి అనుకూలంగా లేదని వివరించే ప్రయత్నం చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మకాయల శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా సమితి ప్రతినిధి మోకా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధత గల నాయకుడు తణుకురాజు



తణుకురాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

తాళ్లరేవు: వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు మందనక్క తణుకురాజు నిబద్ధత గల నాయకుడని, ఆయన చేసిన సేవలు ఆదర్శనీయమని పలువురు కొనియాడారు. ఇటీవల మరణించిన తణుకురాజు సంస్మరణ సభ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, దుప్పి అదృష్టదీపుడు, వల్లు రాజబాబు, విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు తదితరులు తణుకురాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు

తాళ్లరేవు: సుంకరపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని బైపాస్ జంక్షన్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన సదరు డ్రైనేజీని పరిశీలించారు. జాతీయ రహదారి 216 రహదారి విస్తరణ పనుల్లో భాగంగా డ్రైనేజీ సమస్య తలెత్తిందని స్థానిక సర్పంచ్ టిళ్లపూడి నాగేశ్వరరావు వివరించారు.

ఔనని అంటారో.. కాదని అంటారో..

- మత్స్యకారులకు వేట నిషేధ భృతి ఎప్పుడిస్తారో నేటికీ లేని స్పష్టత
- లబ్ధిదారుల ఎంపికపై రీసర్వే చేస్తామంటున్న మంత్రి అచ్చెన్నాయుడు
- కొత్త జాబితాలో తమ పేర్లు ఉంచుతారో పీకేస్తారోనని గంగపుత్రుల ఆందోళన

కాట్రేనికోన: నిత్యం సూరీడు రాకుండానే వల భుజానికెత్తుకుని కష్టాల కడలిలో ప్రాణాలకు తెగించి వేట సాగిస్తేనే గంగపుత్రులకు పూట గడిచేది. అలాంటి మత్స్యకారుల కుటుంబాలన్నీ ఆర్థిక ఇబ్బందులతో తల్లడిల్లుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 15వ తేదీ నుంచి గత నెల 15వ తేదీ వరకూ చేపల వేట నిషేధం అమల్లో ఉండడంతో మత్స్యకారులంతా ఇంటికే పరిమితం కావాల్సి వచ్చింది. ఆ తరువాత వరుసగా అల్పపీడనాలు, భారీ వర్షాలతో చేపల వేటకు వెళ్లడం వీలు కావడం లేదు. మరోవైపు కూటమి ప్రభుత్వం చేపల వేట నిషేధం ముగిసి నెల దాటినా మత్స్యకారులకు భృతిని ఎప్పుడిస్తారో తేల్చి చెప్పడం లేదు. ఇటీవల రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మరో అడుగు ముందుకేసి మత్స్యకార భరోసాకి ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాపై రీసర్వే చేస్తామంటూ ప్రకటించడంతో కొత్త జాబితాలో తమను ఉంచుతారో పీకేస్తారేమోనని గంగపుత్రులు ఆందోళన చెందుతున్నారు.

అప్పట్లో అలా.. ఇప్పుడిలా

కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చేపలు, రొయ్యలు, పీతలు వంటి జలచరాలు గుడ్లు పెట్టే పునరుత్పత్తి సమయంలో మత్స్య సంపద వృద్ధి కోసం ఏటా ఏప్రిల్ 15వ తేదీ నుంచి జూన్ 14 వరకూ 61 రోజుల పాటు సముద్ర జలాల్లో చేపల



బలుసుతిప్పలో చేపల వేట నిషేధంతో నిలిచిన బోట్లు(ఫైల్)

వేట నిషేధం అమలవుతోంది. గత టీడీపీ ప్రభుత్వంలో చేపల వేట నిషేధ సమయానికి గాను మత్స్యకారులకు కేవలం రూ.4 వేలు మాత్రమే ఇచ్చేవారు. అది కూడా చాలా తక్కువ మందికి మాత్రమే ఇచ్చేవారు. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక వేట నిషేధ భృతిని ఏకంగా రూ.10 వేలకు పెంచి మత్స్యకారులందరికీ అందించేవారు. ఏటా వేట నిషేధ సమయంలోనే సదరు మొత్తాన్ని పారదర్శకంగా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు వేసేవారు. అయితే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కూటమి నేతలు మత్స్యకారులకు వేట విరామ సమయానికి గాను రూ.20,000 చొప్పున భృతి ఇస్తామంటూ తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించారు. తీరా అధికారంలోకి వచ్చాక రూ.20,000 సంగతి పక్కన బెడితే అసలు వేట నిషేధ భృతి ఎప్పుడిస్తారోనన్న స్పష్టత సైతం ఇవ్వకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

జాబితాలు పంపినా దిక్కులేదు

జిల్లాలో 2023లో వేట నిషేధం సమయంలోనే మే 16వ తేదీనే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకార భరోసా అందజేశారు. ఉప్పలగుప్తం, అల్లవరం, కాట్రేనికోన, ముమ్మిడివరం, ఐ.పోలవరం మండలాల్లో 1,749 బోట్లపై చేపల వేట సాగించే 9,821 మంది మత్స్యకారులకు రూ.10 వేలు చొప్పున రూ.9.82 కోట్లు అందజేశారు. మరోవైపు తాళ్లరేవు మండలంలో 4,346 మంది లబ్ధిదారులకు రూ.4.34 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఈ ఏడాది సైతం మత్స్యశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉప్పలగుప్తం, అల్లవరం, కాట్రేనికోన, ముమ్మిడివరం, ఐ.పోలవరం మండలాల్లో 1,933 బోట్లపై వేట సాగిస్తున్న 11,305 మంది మత్స్యకారులను, తాళ్లరేవు మండలంలో మరో 4,657 మందిని మత్స్యకార భరోసా పథకానికి అర్హులుగా గుర్తించారు. ఆయా జాబితాలను ఉన్నతాధికారులకు పంపించారు. అయితే రెండు వారాల క్రితం రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వేట నిషేధ సమయానికి ఇచ్చే భృతి విషయంలో లబ్ధిదారుల జాబితాపై మళ్లీ రీసర్వే చేస్తామంటూ ప్రకటించడంతో చిక్కుముడి పడినట్టైంది. ఇప్పటికే వేట నిషేధం ముగిసి నెల దాటినా భృతి ఇవ్వక పోగా ఇప్పుడు మళ్లీ రీసర్వే ఏంటని మత్స్యకారులంతా మండిపడుతున్నారు. రీసర్వే చేసేదెపుడు, తమకు భృతి చెల్లించేదెపుడని ప్రశ్నిస్తున్నారు. జగనన్న ప్రభుత్వంలో వేట నిషేధ సమయంలోనే తమ ఖాతాలో మత్స్యకార భరోసా లబ్ధి వేసేవారని వాపోతున్నారు. వేటకు వెళితే గాని పూట గడవని మత్స్యకారులంతా నిషేధ సమయంలో అప్పులు చేయవలసి వచ్చిందని, భరోసా ఎప్పుడు ఇస్తారో అధికారులకే తెలియడం లేదని ఆవేదన చెందుతున్నారు. కొత్తగా రీసర్వే పేరుతో లబ్ధిదారులను తగ్గించేసేందుకు కూటమి నేతలు కుట్ర పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇల్లు గడవటం కోసం అప్పులు



చేపల వేటకు వెళ్లనిదే పూట గడవని పరిస్థితి మాది. చేపల వేట నిషేధంతో 61 రోజుల పాటు జీవనోపాధిని కోల్పోయాం. ఇల్లు గడవటం కోసం అప్పులు చేశాను. నిషేధం ముగిసి నెల రోజులు దాటినా మత్స్యకారులకు భృతి సొమ్ము వేయలేదు.

– దామ ధనుంజయ, మత్స్యకారుడు, బలుసుతిప్ప

జాబితా ఉన్నతాధికారులకు పంపాం

మత్స్యకార భరోసా పథకానికి అర్హత ఉన్న మత్స్యకారులను గుర్తించి జాబితాను ఉన్నతాధికారులకు పంపించాం. మత్స్యకార భరోసా లబ్ధిదారుల ఎంపికపై రీసర్వే చేయమని ఇప్పటి వరకూ ప్రభుత్వం నుంచి మాకు ఏ విధమైన ఆదేశాలు రాలేదు.

– రామకృష్ణ, ఎఫ్‌డీఓ, కాట్రేనికోన

అప్పట్లో నిషేధ సమయంలోనే లబ్ధి



వైఎస్ జగన్ ప్రభుత్వంలో వేట నిషేధం సమయంలోనే మత్స్యకార భరోసా పథకం ద్వారా లబ్ధిదారులందరికీ బ్యాంకు ఖాతాలకే రూ.10 వేల చొప్పున వేసేవారు. ఇప్పుడేమో జీవనోపాధిని కోల్పోయిన మాకు వేట నిషేధ భృతి ఎప్పుడిస్తారో చెప్పడం లేదు.

– పెసింగి చిన బూసియ్య, మత్స్యకారుడు, చినబొడ్డు వెంకటాయపాలెం

విద్యార్థులకు స్కూల్ కిట్ల పంపిణీ



విద్యార్థులకు స్కూల్ కిట్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, కమిషనర్ మనోహర్ తదితరులు

అమలాపురం టౌన్: పట్టణంలోని వెత్సావారి అగ్రహారంలోని మహాత్మాగాంధీ, కొంకాపల్లిలోని జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలు, నారాయణపేటలోని లాల్ బహదూర్ శాస్త్రి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు స్కూలు బ్యాగ్‌లు, యూనిఫాంలు, షూలు, సాక్సులతో కూడిన కిట్లను గురువారం పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఎస్.మనోహర్, ఆయా వార్డుల కౌన్సిలర్ల చేతుల మీదుగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు కిట్లను అందజేశారు. కార్యక్రమాల్లో కౌన్సిలర్లు పిండి అమరావతి, తిక్కా సత్య లక్ష్మి, చిక్కాల రాంబాబు, ప్రధానోపాధ్యాయులు కామేశ్వరరావు, ఘన సత్యనారాయణ, పోలిశెట్టి, పిండి రాజా తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ఐ.పోలవరం: రాష్ట్ర స్థాయి పెంటాథలన్ క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని జి.మూలపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం కె.జనార్దనరావు గురువారం తెలిపారు. ఇటీవల కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో జరిగిన ఈ పోటీల్లో పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న దండుప్రోలు వీరబాబు అండర్–19 విభాగంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం నిలిచి బంగారు పతకం సాధించాడన్నారు. అలాగే ఎనిమిదో తరగతి చదువుతున్న దండుప్రోలు ఝాన్సీ అండర్–15 విభాగంలో రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచి రజిత పతకం సాధించిందన్నారు. వీరిద్దరూ ఆగస్టు 14వ తేదీ నుంచి 18వ తేదీ వరకూ ఉత్తరాఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులను ఎం.అప్పారావు, ఎం.సూర్యపాల్, రాయుపురెడ్డి బాబిలు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం కె.జనార్దనరావు తదితరులు

డ్వామా ఏపీడీ విచారణ

ఉప్పలగుప్తం: ఈ నెల 15న ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదుపై డ్వామా ఏపీడీ డి.రాంబాబు గురువారం విచారణ చేపట్టారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఉప్పలగుప్తం–2 ఎంపీటీసీ తాళ్ల లక్ష్మీనరసాయమ్మ పెద్దూరు శ్మశాన వాటిక అభివృద్ధికి నోచుకోలేదని, ఉపాధి హామీ పథకంలో శ్మశాన వాటికను మెరక చేయడంతో పాటు విశ్రాంతి భవనం, ప్రహరీ నిర్మించాలంటూ కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. ఈ విషయమై గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఏపీడీ రాంబాబు, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, ఎంపీడీవో కె.వి.ప్రసాద్, ఉపాధి ఏపీవో వి.రాజామణి, ఈవోపీఆర్‌డీ కె.ఎస్.గౌరీ కుమారి పంచాయతీ కార్యదర్శి తిక్కిరెడ్డి రామకృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ కె.అరుణకుమారి తదితరులు ఎంపీటీసీ లక్ష్మీనరసాయమ్మతో మాట్లాడారు. అనంతరం శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు తీసుకునేందుకు ఏపీడీ రాంబాబు ప్రణాళిక సిద్ధం చేశారు.



ఉప్పలగుప్తం ఎంపీడీఓ కార్యాలయంలో విచారణ చేస్తున్న డ్వామా ఏపీడీ రాంబాబు

బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలం



సమావేశంలో మాట్లాడుతున్న బలరాం

అమలాపురం రూరల్: బీజేపీ కార్పొరేట్లకు అనుకూలంగా, పేదలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బలరాం అన్నారు. గురువారం అమలాపురం సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సీపీఎం పార్టీ జిల్లా శిక్షణ తరగతుల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం అదానీ, అంబానీలకు మేలు చేస్తూ కార్పొరేట్లకు కొమ్ముకాస్తుందన్నారు. మరోవైపు వ్యవసాయ కార్మికులకు, రోజువారీ కూలీలకు అన్యాయం చేస్తుందన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలు, రైతు కూలీల పక్షాన నిలబడే పార్టీ సీపీఎం పార్టీ అని ఆయన అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జి.దుర్గాప్రసాద్, జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, ఎస్.బలరాం తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు లిఫ్టర్ల అందజేత

అమలాపురం టౌన్: అస్వస్థత, ప్రమాదాలకు గురైన గోవులను సంరక్షించేందుకు స్థానిక గౌతమ మహర్షి గోసంరక్షణ సమితి గోశాలకు మూడు లిఫ్టర్లను దాతలు సమకూర్చారు. మూడు లిఫ్టర్లను రూ.95 వేల వ్యయంతో కొనుగోలు చేసి గోశాలకు అందించారు. ఇప్పటికే జబల్‌పూర్ జిల్లాకు చెందిన ఇండస్ట్రియల్ సొల్యూషన్స్ సంస్థ అందించిన ఒక లిఫ్టర్‌ను గోవుల సంరక్షణకు వినియోగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా బాధిత గోవులకు లిఫ్టర్ల సేవలను విస్తరించాలని గోశాల వ్యవస్థాపకుడు పోతురాజు రామకృష్ణారావు నిర్ణయించారు. దీంతో దాతలు ముందుకొచ్చి మూడు లిఫ్టర్లను సమకూర్చారు. విశాఖపట్టణం జిల్లా గోపాలపట్నానికి చెందిన స్వర్ణ జ్యూయలర్స్ యాజమాని జూపూడి రంగనాయకులు, హనుమన్ జ్యూయలర్స్ యాజమాని శేట్ మహావీర్‌లు ఒక లిఫ్టర్, కాకినాడకు చెందిన శ్రీకృష్ణ పరివార్ వ్యవస్థాపకులు సుధా మాధురి మరో లిఫ్టర్, అమలాపురం శ్రీరామానందస్వామి ట్రస్ట్ ఇంకో లిఫ్టర్‌ను విరాళంగా సమకూర్చారు. గోశాల ప్రతినిధులు లింగోలు విస్సు, కేవీ మావుళ్లయ్య, పి.నాగకనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డిపై దాడి అమానుషం

అమలాపురం టౌన్: ఎంపీ మిథున్‌రెడ్డిపై టీడీపీ శ్రేణులు దాడి చేయడం అమానుషమని అమలాపురం పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని అన్నారు. దాడిని ఖండిస్తూ గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంపీకే రక్షణ ఇవ్వలేని ఈ కూటమి ప్రభుత్వం శాంతిభద్రతల విషయంలో పూర్తిగా చేతులెత్తేసినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎంపీ మిథున్‌రెడ్డిపై దాడి, వినుకొండలో వైఎస్సార్ సీపీ కార్యకర్త హత్య, రాష్ట్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ దాడులు అన్నీ కావాలని ఓ పథకం ప్రకారం చేస్తున్నారని ఆరోపించారు. అధికారం శాశ్వతం కాదన్న వాస్తవాన్ని కూటమి నేతలు గమనించి ప్రవర్తించాలని బులినాని సూచించారు.

ఉప్పలగుప్తం: రాజంపేట పార్లమెంటు సభ్యుడు, ఉభయ గోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిపై టీడీపీ శ్రేణులు దాడి చేయడం దారుణమని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్ అన్నారు. రాష్ట్రంలో ఒక ఎంపీకు రక్షణ లేదా అని ప్రశ్నించారు. మండలంలోని ఉప్పలగుప్తం గ్రామంలో గురువారం ఆయన నివాసంలో స్థానిక విలేకర్లతో సమావేశమై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్రమంతా వైఎస్సార్ సీపీ నాయకులపై, కార్యకర్తలపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఒక ఎంపీపై దాడి జరుగుతుంటే రక్షించలేని ప్రభుత్వం రాష్ట్ర ప్రజలని ఏ విధంగా రక్షిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులు చేయటంలో చూపిస్తున్న శ్రద్ధ మేనిఫెస్టోను అమలు చేయడంలో చూపించాలన్నారు.



చీకట్ల కిషోర్

డంపింగ్ యార్డు వద్ద నిరసన



బండారులంక డంపింగ్ యార్డు వద్ద నిరసన తెలుపుతున్న స్థానిక ప్రజలు

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక గ్రామంలో అగ్రహారం రోడ్డు వద్ద ఉన్న డంపింగ్ యార్డు వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ స్థానికులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు కారణంగా దోమలు తమ నివాసాలపై విజృంభిస్తున్నాయని, వర్షం పడితే తీవ్ర దుర్గంధం వస్తుందన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే డంపింగ్ యార్డును అక్కడి నుంచి తరలించాలంటూ డిమాండ్ చేశారు. సర్పంచ్ పెనుమాల సునీత డంపింగ్ యార్డ్‌ను పరిశీలించి ప్రజలతో మాట్లాడి సర్ది చెప్పారు. సమస్యను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు దృష్టికి తీసుకెళతామన్నారు. నిరసనలో యాళ్ల సుబ్బలక్ష్మి, పుత్సల వరదరాజులు, కాశిన బాబి పాల్గొన్నారు.

పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి

అమలాపురం టౌన్: పట్టణంలో రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్న ఆవులు, ఆంబోతులు తదితర పశువుల వల్ల ట్రాఫిక్ సమస్య మరింత పెరుగుతోందని పట్టణానికి చెందిన వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్లపై పశువుల సంచారం వల్ల ట్రాఫిక్ సమస్య మరింత జటిలమవుతోందని పట్టణ సీఐ కె.క్రిస్టోఫర్‌కు ఆయన వివరించారు. పట్టణ సీఐని గురువారం స్థానిక పట్టణ పోలీసు స్టేషన్‌లో కలిసి ఈ మేరకు ఓ వినతి పత్రాన్ని అందించారు. అనంతరం సీఐ క్రిస్టోఫర్‌ను జిల్లా చేతి వృత్తుల సంఘం తరపున సత్కరించారు. కార్యక్రమంలో చేతి వృత్తుల సంఘం, వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా ప్రతినిధులు ముసునూరి ఏసుబాబు, పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పట్టణ సీఐ క్రిస్టోఫర్‌ను సత్కరిస్తున్న సూర్యనారాయణమూర్తి తదితరులు

కీటక జనిత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: ప్రస్తుత సీజన్‌లో కీటక జనిత, నీటి ద్వారా ప్రబలే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. గురువారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అమరావతి నుంచి 26 జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తాగునీరు, కీటక జనిత వ్యాధులు, భారీ వర్షాలు, ప్రకృతి విపత్తుల నిర్వహణ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఆవాసంలో రోజుకు 55 లీటర్ల సురక్షిత నీటిని సరఫరా చేయాలన్నారు. ప్రస్తుత సీజన్లో గ్రామ పంచాయతీ, మున్సిపల్ అధికారులు క్రిమి కీటకాల నివారణ కోసం యాంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహించాలన్నారు. డ్రైనేజీల్లో పూడికతీతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సీజనల్ వ్యాధుల బారిన పడినవారికి వైద్య సిబ్బంది సత్వరమే చికిత్సలు అందించాలన్నారు. గోదావరి వరద ముంపు పొంచి ఉన్న లంక గ్రామాల్లో ప్రసవ తేదీ ప్రకారం ఆయా గర్భిణులను, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించాలని ఆదేశించారు. గోదావరి వరదలు సంభవించే అవకాశం ఉన్నందున ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధం కావాలని, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాల సహకారాన్ని కోరాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, డీఆర్‌ఓ ఎం.వెంకటేశ్వర్లు, డీసీహెచ్‌ఎస్ కార్తీక్ రెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌ఓ దుర్గారావు దొర, డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్, డీపీవో డి.రాంబాబు, జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు, గోదావరి హెడ్ వర్క్స్ ఈఈ కె.కాశీ విశ్వేశ్వరరావు, డ్రైనేజీ డీఈ ఎంవీవీ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి సాయం



బాలుడి తల్లిదండ్రులకు సాయం చేస్తున్న సంఘ అధ్యక్షుడు ప్రసాద్ తదితరులు

కొత్తపేట: అనారోగ్యంతో బాధపడుతున్న బాలుడికి మండల శెట్టిబలిజ యువజన సంఘం ద్వారా రూ.50 వేలు అందజేసినట్లు ఆ సంఘ అధ్యక్షుడు బొక్కా ప్రసాద్ తెలిపారు. వెదిరేశ్వరం శివారు మూలగూడెం గ్రామానికి చెందిన ఇళ్ల వెంకటేశ్వరరావు, నాగలక్ష్మి దంపతుల నాలుగు నెలల కుమారుడు లఖిల్ లివర్ వ్యాధి బారిన పడ్డాడు. అతనికి లివర్ శస్త్రచికిత్స చేయాలని వైద్యులు సూచించారు. అందుకు సుమారు రూ.25 లక్షలు అవుతుందని వైద్యులు చెప్పడంతో ఆ దంపతులు దాతలను ఆశ్రయించారు. ఈ మేరకు శెట్టిబలిజ యువజన సంఘ సభ్యులు రూ.50 వేలు సేకరించి బాలుడి తల్లిదండ్రులకు అందజేశారు. సంఘ గౌరవాధ్యక్షుడు యనమదల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి శీలం కొంబాబు, కోశాధికారి మామిడిశెట్టి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వైద్యానికి 'ఇరుకా'టం

అంబాజీపేట: ముక్కామల పీహెచ్‌సీలోని ఇరుకు గదుల్లోనే వైద్య సేవలు అందించాల్సి వస్తుంది. ఈ ఆసుపత్రికి ఏడు గ్రామాల నుంచి ప్రజలు వస్తుంటారు. రోగులకు పరీక్షలు చేసేందుకు, వైద్యం అందించేందుకు తగిన గది లేక పీహెచ్‌సీ వరండాను ఆనుకుని రేకుల షెడ్డును నిర్మించారు. రోగులకు అక్కడే పరీక్షలు చేయడం, మరోపక్క సెలైన్ ఎక్కించడం, ఇంజెక్షన్లు చేస్తున్నారు. గర్భిణులకు పరీక్షలు చేయాలన్నా, వచ్చే రోగులకు వైద్య సేవలందించాలన్నా సరైన వసతి లేక ఇబ్బందులు తప్పడం లేదు. ఇక్కడి జెడ్పీ హైస్కూల్ సమీపంలో పీహెచ్‌సీ నూతన భవనాన్ని నిర్మించేందుకు రూ.1.20 కోట్లు మంజూరు కాగా, స్థలం వివాదంతో పనులు చేపట్టలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలి.



ముక్కామలలో రేకుల షెడ్డులోనే వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

ఆర్థిక సంఘం నిధులతో సీసీ రోడ్లు

మామిడికుదురు: ఆర్థిక సంఘం నిధులతో సీసీ రోడ్లు నిర్మించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నామని లూటుకుర్రు సర్పంచ్ అడబాల తాతకాపు తెలిపారు. గ్రామంలోని శెట్టిబలిజ ప్రాంతంలో రామాలయం వద్ద 15వ ఆర్థిక సంఘం నిధులతో రెండు సీసీ రోడ్లకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రూ.6 లక్షలతో నాలుగు రోడ్లు నిర్మిస్తామన్నారు. ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ కోట బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.